చేనేత వస్త్రాలను ధరించాలి



శ్రీనగర్‌కాలనీ: మన సంస్కృతిలో భాగమైన భారతీయ వస్త్రాలు, చేనేతకారుల ఉత్పత్తులను ప్రతిఒక్కరూ ధరించాలని నగర సోషలైట్, లైఫ్ కోచ్ శ్రీలక్ష్మీరెడ్డి అన్నారు. సిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలతో శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయినిగమాగమంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో పేరిట ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనను గురువారం ఆమె ప్రారంభించారు. ప్రదర్శనలోని సిల్క్, కాటన్ వస్త్రాలు మగువల మనసు దోచుకుంటున్నాయి. చేనేత ప్రదర్శనలో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 60 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామని నిర్వాహకులు జయేష్‌గుప్తా తెలిపారు. ప్రదర్శన ఈ నెల 18 వరకూ కొనసాగుతుంది.

ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రజాశక్తి పార్టీ ఆవిర్భావం

హిమాయత్‌నగర్: రైతన్నలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్రీయ ప్రజాశక్తి పార్టీ ఆవిర్భవించిందని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ భవానీ శంకర్ తెలిపారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అరిగెల శ్రీరామ్, ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ శివప్రసాద్‌కుమార్‌తో కలిసి గురువారం పార్టీ లోగోను ఆవిష్కరించి మాట్లాడారు. యువతలో కొత్త శక్తిని, ఉత్సాహాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. పార్టీ రాష్ట్ర కోశాధికారి మనిషా, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాచం వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శి దుర్గాభవాని పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖలో ఉద్యోగాల పేరుతో మోసం

న్యాయం చేయాలని బాధితుల విజ్ఞప్తి

హిమాయత్‌నగర్: ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఇప్పించి ఆరు నెలలకే పర్మినెంట్ చేస్తారని తప్పుడు ఆర్డర్ కాపీలతో నమ్మించి రూ.1.40 కోట్లు కాజేసి మోసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో గురువారం వారు మీడియాతో మాట్లాడారు. కరీంనగర్‌కు చెందిన బొజ్జిగిరి శ్రీనివాస్, అతడి స్నేహితుడు అబ్బోజు శ్రీనివాస్, అతడి చెల్లెలు బొజ్జిగిరి శ్యామల ఆరోగ్య శాఖలో(సీనియర్ అసిస్టెంట్)లు కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. ఉద్యోగ శిక్షణతో పాటు సచివాలయం తీసుకెళ్లి ఓ ఆఫీసర్ దగ్గర ఇంటర్వ్యూ చేయించారని తెలిపారు. చివరికి ఉద్యోగ ఆర్డర్ కాపీ నకిలీదని తేలిందన్నారు. రాంగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

మహిళతో సహజీవనం చేసి ముఖం చాటేసి..!

బంజారాహిల్స్ పీఎస్‌లో యవకుడిపై కేసు

బంజారాహిల్స్: భర్తను కోల్పోయిన మహిళను పెళ్లి చేసుకుని అండగా ఉంటానని నమ్మించి ఆమెతో మూడేళ్లు సహజీవనం చేసి ముఖం చాటేసిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన ఓ మహిళ తన భర్తతో కలిసి పదేళ్లుగా నగరంలో ఉంటోంది. వీరికి ఇద్దరు పిల్లలు. ఆమె భర్త 2020లో కేన్సర్ వ్యాధితో చనిపోయాడు. ఆ తర్వాత ఆమె పిల్లలతో కలిసి ఒడిశాకు వెళ్లిపోయింది. 2021లో మళ్లీ హైదరాబాద్‌కు తిరిగి వచ్చి సోమాజిగూడ ప్రాంతంలో ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటోంది. ఆమె స్నేహితుడు రాజా ద్వారా బీహార్ నుంచి వలసవచ్చి బంజారాహిల్స్ రోడ్డు నంబర్–7లో ఉండే సేల్స్‌మెన్ మహ్మద్ అశ్వక్(22) పరిచయం అయ్యాడు. ఆమె పూర్తి వివరాలను తెలుసుకుని పరిచయమైన ఐదు రోజుల తర్వాత ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. ఇందుకు ఆమె కూడా ఒప్పుకోవడంతో మూడేళ్లుగా ఇద్దరూ ఆమె పిల్లలతో కలిసి అతడి గదిలో ఉంటోంది. ఆమె పెళ్లి విషయం ప్రస్తావించగా పెళ్లి చేసుకునే ఉద్దేశ్యం తనకు లేదని, తనను విడిచిపెట్టాలని చెప్పాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. పెళ్లి చేసుకోకుండా తనను వేధిస్తున్నాడంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... నారాయణ్‌పేట జిల్లాకు చెందిన చాకలి మణెమ్మ (50) యాకుత్‌పుర రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిఒక్కరూ దేశభక్తిని చాటాలి


చిక్కడపల్లి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా గురువారం డివిజన్‌లోని కార్పొరేటర్ పావని తన నివాసంపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ జాతీయ సమైకత్యను విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు. దేశ రక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ త్యాగాన్ని భారత జాతి ఎన్నటికి మరవదు

కవాడిగూడ: భగత్‌సింగ్ దేశ స్వాతంత్రం కోసం చేసిన త్యాగాలను భారత జాతి ఎన్నటికీ మరువదని.. మహనీయులను ఆదర్శంగా తీసుకొని దేశభక్తి ప్రతి ఒక్కరిలో పెంపొందించేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పాటు పాడుతోంని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ అన్నారు. రాష్ట పార్టీ పిలుపు మేరకు మహనీయుల విగ్రహాలను శుద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా గురువారం కవాడిగూడ డివిజన్‌లోని ఏవీ కళాశాల వద్ద ఉన్న భగత్‌సింగ్ విగ్రహాన్ని పాలతో శుద్ధి చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సలంద్రి దిలీప్ యాదవ్, నాయకులు జి.వెంకటేష్, పరిమళ్ కుమార్, మురారీశెట్టి కేశవరాజు, బొల్ల రమేష్ బాబు, ప్రభాకర్ గంగపుత్ర తదితరులు పాల్గొన్నారు.

వీర సావర్కర్ జీవిత చరిత్రను తెలుసుకోవాలి

కాచిగూడ: ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధులు వీర సావర్కర్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం కాచిగూడ చౌరస్తాలోని వీర సావర్కర్ విగ్రహానికి ఆమె పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ వీర సావర్కర్ జీవిత చరిత్రను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బల్వీర్, శేర్‌సాగర్, సుభాష్ పటేల్, కృష్ణకుమార్, మల్లికార్జున్, వాసు, ఆర్.సంతోష్, సాయి, సితారామ్, లావణ్య, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



మువ్వన్నెల రంగుల వెలుగులో చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్



ఏవీ కళాశాల వద్ద భగత్‌సింగ్ విగ్రహాన్ని పాలతో శుద్ధి చేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ



గాంధీనగర్‌లో తన నివాసంపై జాతీయ జెండాతో కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ దంపతులు



కాచిగూడ చౌరస్తాలోని వీర సావర్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ఉమారాణి, బీజేపీ నాయకులు

చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి

కాచిగూడ: దేశ విభజన సమయంలో జరిగిన విషాద సంఘటనలను గుర్తు చేసుకుంటూ గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో 'దేశ విభజన గాయాలు – స్మృతి దినం'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ విభజనలో కోట్లాది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. లక్షల కుటుంబాలు ఇల్లు, భూములు కోల్పోయి నిరాశ్రయులయ్యారని అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి విషాదం మళ్లీ జరగకుండా చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలని ఆయన సూచించారు. డాక్టర్ ఎస్.గౌతంరావు మాట్లాడుతూ.. దేశ విభజన కేవలం భౌగోళిక సరిహద్దుల మార్పు కాదన్నారు. ఇది మానవ చరిత్రలో అతి పెద్ద వలసలలో ఒకటని పేర్కొన్నారు. మతం, జాతి, భాష పేరుతో విభజన చేసే కుట్రల పట్ల ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఓ. శ్రీనివాస్‌రెడ్డి, సూర్యప్రకాష్‌సింగ్, సుమన్, ప్రేమ్‌ప్రసాద్, అజయ్, ఆనంద్, రమేష్‌యాదవ్, కేశబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

32 పోస్టులకు 145 దరఖాస్తులు

చాదర్‌ఘాట్: రాష్ట్ర వికలాంగులు వయో వృద్ధుల ట్రాన్స్‌జెండర్స్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బధిరుల ఆశ్రమ పాఠశాలలో టీజీటీ, ఎస్‌జీటీ 32 పోస్టులు ఉండగా తాత్కాలిక నియామకాలకు 145 దరఖాస్తులు వచ్చాయని డైరెక్టర్ అరుణ తెలిపారు. అర్హులను ఎంపిక చేసి త్వరలో నియామక పత్రాలు అందజేస్తామన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



రేణుకాఎల్లమ్మను దర్శించుకుంటున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

అంబర్‌పేట: అంబర్‌పేట సీపీఎల్ ప్రధాన రోడ్ తిరుమలనగర్‌లోని రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. వేడుకలను మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ముఖ్యఅతిథులుగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించాలి

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించి మాలలతో పాటు 26 ఎస్సీ కులాలకు న్యాయం జరిగేలా చూడాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు కోరారు. ఈ మేరకు గురువారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ 2025 చట్టంతో విద్యా, ఉద్యోగాల్లో మాలలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో చర్చించి మాలలకు తగు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించే వరకు ఉద్యోగ నోటిఫికేషన్లను నిలుపుదల చేయాలన్నారు. చట్ట సవరణ తర్వాతే ఉద్యోగాల నియామక ప్రక్రియను మొదలు పెట్టాలని కోరారు.



ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతి పత్రం అందజేస్తున్న రమేష్‌బాబు

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్

ముషీరాబాద్: జంపన దుర్గా 5వ స్మారక (బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఈనెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు) మూడు రోజుల పాటు ముషీరాబాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగాయి. వెటరన్, గ్రూప్–ఏ, బీ, అండర్–30 ఉమెన్స్ కేటరిగిలో మొత్తం 60 టీమ్‌లకు పైగా పాల్గొన్నాయి. ఇందులో వెటరన్ విభాగంలో పరమేశ్వర్, ప్రకాశ్‌లు, గ్రూప్–ఏలో మురళీకృష్ణ, పవన్, గ్రూప్–బీలో రాము, రాధాకృష్ణ, అండర్–30 కేటగిరిలో మంజిత్‌రెడ్డి, సుఖేష్, ఉమెన్స్ కేటగిరిలో శ్రీదుర్గ, సాన్వీలు విజేతలుగా నిలిచారు. ముఖ్యఅతిథులుగా హాజరైన డాక్టర్ అశోక్, సి.హెచ్.వీరారెడ్డి, బొల్లం శ్రీనివాస్, క్రికెట్ ఎంపైర్ పరమేశ్వర్, ఎం.ఎస్.చారి తదితరులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ రమేష్‌బాబు, మనోజ్, రాజు, వామన్, జైపాల్‌రెడ్డి, విశాల్, తీర్థ, తదితరులు పాల్గొన్నారు.



మెమొంటోలతో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతలు

వైభవంగా దుర్గాభవాని విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



పూజలో పాల్గొన్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

కాచిగూడ: ఎన్ని పనులున్నా భగవంతుని సన్నిధిలో కాసేపు గడపడానికి సమయాన్ని కేటాయించాలని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. లింగంపల్లిలోని మహంకాళి దేవాలయంలో గురువారం శ్రీదుర్గా భవాని అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఆయన పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమారాణి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ప్రముఖ సంఘ సేవకులు తోట రఘునాథ్‌రావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.గోపాల్, ప్రధానకార్యదర్శి ఎస్.అరవింద్, ఉపాధ్యక్షుడు యాదప్ప, కోశాధికారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామి దేవాలయాన్ని పరిరక్షించాలి



సామాజిక కార్యకర్త గొర్ల చంద్రశేఖర్‌యాదవ్

చిక్కడపల్లి: పురాతనమైన లక్ష్మీ నారాయణస్వామి దేవాలయాన్ని పరిరక్షించాలని ప్రముఖ సామాజిక కార్యకర్త, సంఘ సేవకుడు గొర్ల చంద్రశేఖర్‌యాదవ్ అన్నారు. చిక్కడపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుత్లిబౌలిలోని అతి పురాతనమైన లక్ష్మీనారాయణస్వామి దేవాలయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలో తీసుకోవాలన్నారు. ఎంతో ప్రాముఖ్యత గల దేవాలయంలో స్వామివారికి ధూప దీప నైవేద్యాలు లేక పోవడంతో భక్తులు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా దేవాలయానికి సంబంధించిన విలువైన భూమి కూడా కాపాడాలని ఆయన కోరారు. దీనిపై ఇప్పటికే దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ వెంకట్రావుకు వినతిపత్రం ఇచ్చామని ఆయన తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించారని శాఖ ఆధీనంలోకి తీసుకోవడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

వేడుకగా కృష్ణాష్టమి



అంబర్‌పేట: కృష్ణాష్టమి వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. గురువారం ప్రేమ్‌నగర్‌లోని హైమవతి పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర దినోత్సవ వేడుకలతో పాటు కృష్ణాష్టమి వేడుకలను సందడిగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ హైమవతి, ప్రిన్సిపల్ నిరంజన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌తో పరేషాన్.!



లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఇందిరాపార్క్ లైన్‌లో కార్ల అక్రమ పార్కింగ్

కవాడిగూడ: డివిజన్ పరిధిలో రహదారులకు ఇరువైపులా అడ్డగోలుగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. అసలే వర్షాలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుంటే కొందరు రోడ్ల పక్కనే కార్లను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డు కుంచించుకుపోయి సాధారణ రోజుల్లో సైతం ట్రాఫిక్ జామ్ అవుతోంది. రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నోటీసులు జారీ చేశాం

ఇందిరాపార్కు చౌరస్తా నుంచి లోయర్ ట్యాంక్‌బండ్ కనకాల కట్టమైసమ్మ వైపు వెళ్లే దారిని అత్యంత రద్దీగా ఉండే ప్రదేశంగా గుర్తించామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న వ్యాపార సముదాయాల ఎదుట వాహనాలు నిలుపుతున్నారని అన్నారు. దీనిని కట్టడి చేసేందుకు వాహనాలకు చలాన్లు విధిస్తున్నామని తెలిపారు. అయినా అలాగే వాహనాలను నిలపడంతో ఓ షాపు నిర్వాహకుడికి నోటీసులు జారీ చేశామన్నారు. వాహనదారులు పార్కింగ్ స్థలంలోనే వాహనాలను నిలిపి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ఆమె కోరారు.

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి

మండపాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

బంజారాహిల్స్: గణేష్ మండప నిర్వాహకులు తమ పరిధిలోని పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సంపూర్ణ సహకారం అందిస్తూ గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో వైభవంగా నిర్వహించుకోవాలని జూబ్లీహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం గణేష్ మండప నిర్వాహకులతో ఉత్సవ కమిటీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. రాత్రి 11 గంటల తర్వాత ఎలాంటి మ్యూజిక్ వినిపించకూడదని, భజనలు, కీర్తనలు చేసుకున్నా సరే బయటకు సౌండ్ రాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తాము ఎక్కడ మండపం ఏర్పాటు చేస్తున్నదీ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. విగ్రహాలు నిమజ్జనానికి ఎప్పుడు వెళ్లేది రూట్‌మ్యాప్ కూడా స్థానిక పోలీసులకు ఇవ్వాలని స్పష్టం చేశారు. అనుమానితుల కదలికలపై దృష్టి సారించాలన్నారు. మండపాల వద్ద తప్పనిసరిగా నిర్వాహకులు రాత్రిపూట అప్రమత్తంగా ఉండాలని వెల్లడించారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటేశ్వరరెడ్డి, ఎస్‌ఐలు శ్రీశైలం, సోమశేఖర్, జగదీష్, వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రవణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



గణేష్ మండప నిర్వాహకులకు మార్గదర్శకాలు చేస్తున్న జూబ్లీహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి

ప్రజాస్వామ్యాన్ని కేంద్రం అపహాస్యం చేస్తోంది

ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

కవాడిగూడ: కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఈడీ, సీబీఐ లాగానే ఈసీని కూడా జేబు సంస్థల్లా మార్చుకుందని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆరోపించారు. గురువారం ఏఐసీసీ పిలుపులో భాగంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద 'ఓట్ చోర్ గద్దీ చోడ్'కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశంలోని అనేక పార్లమెంట్ నియోజకవర్గాల్లో దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిందన్నారు. దాదాపు 70 పార్లమెంట్ నియోజకవర్గాలలో ఓట్ల అవకతవకలు జరిగాయని ఆరోపించారు. సికింద్రాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గెలుపుపై కూడా పలు అనుమానాలు ఉన్నాయని అన్నారు. అనేక అవకతవకలతో సహా కేంద్ర ఎన్నికల కమిషన్‌ను నివేదిక అందజేసినప్పటికీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి ఎన్నికల కమిషన్ కొమ్ముకాస్తూ మాట్లాడటం సరికాదన్నారు. ఈ ఉద్యమం నిరంతరం కొనసాగుతోందని అన్నారు. బీజేపీని గద్దెదించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్, సీనియర్ కాంగ్రెస్ నేతలు వీడీ కృష్ణ, మారిశెట్టి నర్సింగారావు, సంగపాక వెంకట్, పోతరాజు భాస్కర్, అభిషేక్ కెనడీతో పాటు పెద్ద సంఖ్యలో యువజన కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే శ్రీగణేష్

మూసీ పరీవాహక ప్రాంతాల్లో చెత్త వేయొద్దు

చాదర్‌ఘాట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మూసీ పరీవాహక ప్రాంతాల్లో చెత్త కుప్పలు లేకుండా చూడాలని మలక్‌పేట డీసీ అలీ ఆదేశించారు. గురువారంఆయన మూసీ పరీవాహక ప్రాంతాన్ని పర్యటించి మాట్లాడారు. వర్షాలు కురుస్తున్న కారణంగా డెంగీ సోకే ప్రమాదం ఉంటుందని ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు వేయరాదన్నారు.అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు సమాచారం లేకుండా ఎక్కడికి వెళ్లరాదని గ్రేటర్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు.



అధికారులతో కలిసి ఓల్డ్‌మలక్‌పేటలో పర్యటిస్తున్న డీసీ, ఏఎంహెచ్‌ఓ

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010463222